సాక్షి పల్నాడు
బుధవారం। 28 । జూన్ । 2023



కార్తికేయుని సేవలో..

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, వైఎస్సార్ సీపీ నేత కడవకొల్లు నరసింహారావు మంగళవారం దర్శించుకున్నారు.



బాలల రక్షణకు చర్యలు

నెహ్రూనగర్: బాలల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. చైల్డ్ హెల్ప్‌లైన్‌పై జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

రేవతికి రజతం



తెనాలి: నెల్లూరులో జరిగిన పవర్‌లిఫ్టింగ్, బ్రెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో 69 కిలోల విభాగంలో తెనాలికి చెందిన వక్కలగడ్డ రేవతి రజత పతకం సాధించింది. శ్రీషిర్డి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ తరఫున కె.లక్ష్మణబాబు మంగళవారం సత్కరించారు.

న్యూస్‌రీల్

త్రికోటేశ్వరుని హుండీ ఆదాయం రూ.53.05లక్షలు




నరసరావుపేటరూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయానికి హుండీల ద్వారా రూ.53,05,561 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో గొలమూరి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయంలో మంగళవారం హుండీల లెక్కింపు నిర్వహించారు. నరసరావుపేట గ్రూప్–2 ఆలయాల కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటేశ్వరరావు లెక్కింపును పర్యవేక్షించారు. హుండీల ద్వారా ద్వారా బంగారం 24గ్రాములు, వెండి 502గ్రాములు వచ్చినట్లు వివరించారు. హుండీల ద్వారా గతేడాది కన్నా రూ.8,42,366 అధికంగా ఆదాయం లభించినట్లు తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు ముక్కు వెంకటేశ్వరరెడ్డి, తంగేడుమల్లి కేనరా బ్యాంక్ సిబ్బంది, ఆలయ సిబ్బంది, నరసరావుపేట సేవక బృందాలు పాల్గొన్నారు.

యార్డులో 38,969 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 37,400 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 38,969 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,300 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాళకు రూ.9,500 నుంచి 22,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ. 11,200 నుంచి రూ. 24,700 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 13,072 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 519.80 అడుగుల వద్ద ఉంది. ఇది 148.9116 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి వచ్చే నీటిచేరిక పూర్తిగా నిలిచిపోయింది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 808.70 అడుగుల వద్ద ఉంది. ఇది 33.5776 టీఎంసీలకు సమానం.

పుస్తకాల గదికి సీల్



నరసరావుపేట ఈస్ట్: అధిక ధరలకు పుస్తకాలను విక్రయిస్తున్న నారాయణ విద్యాసంస్థలకు చెందిన పుస్తకాల గదిని విద్యాశాఖాధికారులు సీజ్ చేశారు. రామిరెడ్డిపేటలోని నారాయణ పాఠశాలలో పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్‌కు ఫిర్యాదు చేశారు. డీఈఓ ఆదేశాల మేరకు డిప్యూటీ డీఈఓ కె.వేణుగోపాలరావు, ఎంఈఓ ఎస్.నాగేశ్వరరావులు తమ సిబ్బందితో పాఠశాలకు వెళ్లి తనిఖీలు నిర్వహించారు. నోట్‌బుక్స్, టెక్స్ట్ బుక్స్, ఇతర సామగ్రి ఉన్న గదికి సీల్ వేశారు. పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులను విచారించి నివేదికను డీఈఓకు అందచేశారు.

ఆర్థికసాయం.. ఒడి చేరే తరుణం



ఈ చిత్రంలోని మహిళ పేరు యాకమ్మ.. కారెంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామానికి చెందిన ఈమె సంచార వర్గానికి చెందినవారు. ఇళ్లిళ్లు తిరిగి సోది చెప్పడం.. ఇతరత్రా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. వీరి వంశంలో ఇంతవరకు స్కూల్‌కు వెళ్లి చదువుకున్నవారు లేరు. మొదట్లో తన కుమార్తె అనూషను బడికి పంపేది కాదు. కొన్నాళ్లాగి తనతోపాటు సహకారిగా ఉండేందుకు పనులకు తీసుకెళదాం అనుకుంటుండగా.. ప్రభుత్వ పాఠశాలకు పంపితే అమ్మ ఒడికి కింద ప్రభుత్వం ఆర్థికసాయం చేస్తుందని.. రుచికరమైన మధ్యాహ్న భోజనం పెడతారని, చక్కగా చదువు చెప్తారని విని స్థానిక ఎస్సీ కాలనీలోని పాఠశాలకు పంపడం ప్రారంభించింది. గత మూడేళ్లుగా తమ అమ్మాయి స్కూల్ డ్రెస్ వేసుకుని, బూట్లు వేసుకుని బడికి వెళ్తుంటే తమలో ఎవరికీ దక్కని అదృష్టం తమ అమ్మాయికే దక్కిందని ఆనందపడేది. రెక్కాడితే గానీ గంజి తాగలేని దుస్థితిలో ఉన్న తాము అమ్మ ఒడి ఇచ్చే ఆసరా ద్వారానే బడికి పంపించగలుగుతాన్నామని ఆనందం వ్యక్తం చేసింది.

నేడు తల్లుల ఖాతాల్లో అమ్మ ఒడి నగదు జమ

- జిల్లాలో 1,87,417 మంది లబ్ధిదారులు
- రూ.243.64కోట్లు జమ చేయనున్న ప్రభుత్వం

నరసరావుపేట ఈస్ట్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక అమ్మఒడి పథకం నాలుగో విడత నిధులు విద్యార్థుల తల్లుల ఖాతాలో పడనున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాంలో జరిగే సభలో సీఎం వైఎస్ జగన్ నేడు బటన్ నొక్కి పిల్లలను పాఠశాలలకు పంపుతున్న తల్లుల ఖాతాల్లో రూ.15వేలు చొప్పున జమ చేయనున్నారు. పల్నాడు జిల్లా పరిధిలో 1,87,417 మంది అర్హులైన లబ్ధిదారులకు రూ.243.64 కోట్లు జమ కానున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు చదువుతున్న విద్యార్థులలో అర్హులను గుర్తించి విద్యార్థి తల్లి ఖాతాలో నగదును జమ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన అర్హుల జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు ఆయా పాఠశాలల నోటీస్ బోర్డులో ప్రదర్శిస్తున్నారు. సాంకేతిక లోపాల కారణంగా అర్హులైన విద్యార్థుల పేర్లు జాబితాలో లేనిపక్షంలో వారికి మరో అవకాశం ఉంటుంది. అమ్మ ఒడి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని సమావేశ మందిరంలో ఏర్పాట్లు చేశారు.

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు...

అమ్మ ఒడి పథకానికి పెదకూరపాడు నియోజక వర్గం నుంచి 25,927మంది, చిలకలూరిపేట 22,687, నరసరావుపేట 22,217, సత్తెనపల్లి 25,728, వినుకొండ 30,303, గురజాల 29,727, మాచర్ల నియోజకవర్గంలో 30,828మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు.



పాఠశాలకు వెళ్తున్న విద్యార్థినులు

జాబితాలో పేరు లేనివారికి మరో అవకాశం



అమ్మ ఒడి లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకతను పాటించాం. వలంటీర్ల ద్వారా ఇంటింటికి వెళ్లి అర్హులైన లబ్ధిదారులను సచివాలయాల ద్వారా ఎంపిక చేయడం జరిగింది. అర్హత ఉండి జాబితాలో పేరు రానివారికి మరో అవకాశం ఉంటుంది. ఏకారణంతోనైనా జాబితాలో పేరు రాకపోతే, సంబంధిత పత్రాలను జత చేసి వలంటీర్ల ద్వారా సచివాలయాలల్లో నవరించుకొని అమ్మ ఒడి పొందొచ్చు.

– కె.శామ్యూల్, జిల్లా విద్యాశాఖాధికారి

మేనమామలా ఆర్థిక భారాన్ని తొలగించారు



ఆడపిల్లని చదివించటం ఆర్థిక భారం అనుకున్నాం. కానీ, సీఎం జగనన్న మా కూతురు మౌనికకు మేనమామలా అమ్మ ఒడి ద్వారా రూ.15వేలు అందించటమే కాకుండా బడిలో కార్పొరేట్ స్థాయిలో అన్ని సౌకర్యాలు కల్పించారు. యూనిఫాం, షూ, పుస్తకాలు, మంచి భోజనం అందిస్తూ మాకు భరోసా కల్పించారు.

– వేముల దుర్గ, విద్యార్థిని తల్లి

ఆర్థికాభివృద్ధికి సహకరించండి

డీఎల్ఆర్‌సీ, డీసీసీ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ శివశంకర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, పక్కన బ్యాంకర్లు, జిల్లా అధికారులు

నరసరావుపేట: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం నిర్దేశించిన ఆర్థిక రుణాల లక్ష్యాలను సాధించడానికి బ్యాంకర్లు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన డీఎల్‌ఆర్‌సీ, డీసీసీ సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయ, గృహ నిర్మాణం, విద్యా రుణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పీఎంఈజీపీ రుణాలు, స్టాండప్ ఇండియా పథకానికి సంబంధించి రుణాలతో పాటు, కౌలు రైతులకు, రైతుమిత్ర గ్రూపులకు, ఎస్.హెచ్.జి గ్రూపులకు, పశుసంవర్ధకశాఖ, ఫిషరీస్ పథకం దరఖాస్తు చేసుకున్న వారికి రుణాలను ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆర్‌బీఐ, నాబార్డు, ఎస్ఎల్‌బీసీ నిబంధనలను పాటిస్తూ ప్రజలకు సకాలంలో నూరుశాతం రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సమావేశానికి రాని బ్యాంకులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్‌డీఎం, డీసీసీ కన్వీనర్లను ఆదేశించారు. దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను బ్యాంకుల ద్వారా అన్నివర్గాల ప్రజలకు అమలు చేస్తుందని, పథకాల నగదును జమచేస్తుందని, అటువంటి తరుణంలో ఎస్సీ, ఎస్టీలకు రుణాలను తప్పనిసరిగా అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఆర్‌బీఐ జిల్లా అధికారి నాగప్రవీణ్, నాబార్డు అధికారితో పాటు పలువురు జిల్లా ఉన్నతాధికారులు, జిల్లాకు చెందిన పలువురు బ్యాంకర్లు, ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ శిక్ష

గురజాల: హత్య కేసులో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ మంగళవారం పదో అదనపు జిల్లా జడ్జి గాజుల వెంకటేశ్వర్లు తీర్పునిచ్చారు. జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బారెడ్డి నాగిరెడ్డి తెలిపిన వివరాలు.. రెంటచింతల గ్రామానికి చెందిన శ్యామల రాజశేఖరరెడ్డి అలియాస్ రాజాకు దొరసాల కొండారెడ్డికి మధ్య పొలం గట్టు వివాదం ఉంది. ఫిబ్రవరి 26,2017న శ్యామల రాజశేఖరరెడ్డితో పాటు పేరం సీతారెడ్డి, చిన్న సీతారెడ్డి, జె.కోటిరెడ్డి కలసి కొండారెడ్డితో మాట్లాడేందుకుగాను పెద్దమనుషులతో కలసి గురజాల మండలం సత్యనారాయణపురం క్యాంపునకు వెళ్లారు. వారి మధ్య మాటమాట పెరిగి పేరం సీతారెడ్డి, చిన్న సీతారెడ్డి, జె.కోటిరెడ్డిలపై దొరసాల కొండారెడ్డి, శ్రీనివాసరెడ్డి, అశోక్‌రెడ్డి దాడి చేశారు. ఈ దాడిలో శ్యామల రాజశేఖర్‌రెడ్డి అలియాస్ రాజా తలకు గాయం కావడంతో క్షతగాత్రుడిని గురజాల వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. గుంటూరులో చికిత్స పొందుతూ మార్చి 1, 2017న శ్యామల రాజశేఖరరెడ్డి మృతిచెందారు. అప్పటి గురజాల సీఐ రాయన ధర్మేంద్రబాబు కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితులైన దొరసాల కొండారెడ్డి, శ్రీనివాసరెడ్డి, అశోక్‌రెడ్డిలకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జడ్జి పై విధంగా తీర్పునిచ్చారు.

నిమ్మకాయల ధర



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులోమంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.1000, గరిష్ఠ ధర రూ.2000, మోడల్ ధర రూ.1400 వరకు పలికింది.

నూతన జీవితాన్నిచ్చే 'న్యూ'రాలజీ!

జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో అధునాతన వైద్యసేవలు

- స్ట్రోక్ యూనిట్, స్లీప్ ల్యాబ్ కల్గిన ఏకైక ప్రభుత్వ ఆస్పత్రిగా గుర్తింపు
- బ్రెయిన్ స్ట్రోక్, ఫిట్స్, జీబీ సిండ్రోమ్ వ్యాధులకు మెరుగైన వైద్యం
- న్యూరాలజీ వైద్యసేవలకు ఐఎస్ఓ గుర్తింపు



స్ట్రోక్ యూనిట్‌లో చికిత్స పొందుతున్న రోగులు (ఫైల్)

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో అధునాతన వైద్యసేవలను ఉచితంగా అందిస్తున్నారు. లక్షలాది రూపాయలు ఖరీదు చేసే వైద్యసేవలను ఎంతో మంది పేదలకు ఉచితంగా అందించి ప్రాణాలు కాపాడుతూ అందరి మన్ననలు పొందుతున్నారు. న్యూరాలజీ వైద్య విభాగంలో ఉన్న వైద్య పరికరాలు, వైద్య సౌకర్యాలు రాష్ట్రంలోని ఏ కార్పొరేట్ ఆస్పత్రుల్లో కనిపించవు. దీంతో రోగులు వైద్యసేవలను వినియోగించుకునేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి అధిక సంఖ్యలో వస్తున్నారు.

న్యూరాలజీ వార్డు ప్రత్యేకతలు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఏ ప్రభుత్వ ఆసుపత్రిలో లేనివిధంగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారికి(పక్షవాతం) ప్రత్యేకంగా స్ట్రోక్ యూనిట్ ఉండటం విశేషం. నిద్రలేమి సమస్యలతో బాధపడేవారికి సైతం స్లీప్‌ల్యాబ్‌ను కేవలం గుంటూరు జీజీహెచ్‌లో మాత్రమే ఏర్పాటు చేసి న్యూరాలజీ వైద్యులు రాష్ట్రస్థాయి గుర్తింపు తెచ్చుకున్నారు. న్యూరాలజీ వైద్య విభాగంలో నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నందుకు 2018 జూన్‌లో ఐఎస్ఓ 9001- 2015లో గుర్తింపు లభించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఐఎస్ఓ గుర్తింపు పొందిన ఏకైక విభాగం న్యూరాలజీ మాత్రమే.

దాతల సహాయంతో ఏర్పాటు..

న్యూరాలజీ వైద్యవిభాగంలో స్ట్రోక్ యూనిట్ ఏర్పాటుకు చిలుకలూరిపేటకు చెందిన ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ వారు రూ. 21లక్షలు, గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ కోయ రామకోటేశ్వరరావు రూ.22 లక్షలు, రోటరీ క్లబ్ ఆఫ్ అమెరికా రూ.50లక్షలు మ్యాచింగ్ గ్రాంట్‌ను అందించారు. న్యూరాలజీ వైద్య విభాగంలో 10 పడకలతో స్ట్రోక్ యూనిట్, 10పడకలతో న్యూరో ఐసీయూ ఏర్పాటుకు దాతలు ఎంతో కృషి చేశారు. స్ట్రోక్ యూనిట్ లో 2015 అక్టోబర్ నుంచి వైద్యసేవలను అందిస్తున్నారు. నాట్కో ట్రస్టు రూ.25 లక్షల విరాళంగా అందించడంతో రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా నిద్రలేమి సమస్య బాధితులకు న్యూరాలజీ వైద్య విభాగంలో 2017 జూలైలో స్లీప్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు.

వారంలో మూడు రోజులు ఓపీ వైద్యసేవలు...

మంగళవారం, గురువారం, శనివారం న్యూరాలజీ సంబంధిత సమస్యల రోగులకు ఓపీ విభాగంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్యసేవలను అందిస్తున్నారు. స్ట్రోక్ బాధితులకు క్యాజువాలిటీలో ఎల్లప్పుడు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు.

అరుదైన వ్యాధులకు చికిత్స...

అత్యంత అరుదైన వ్యాధులకు సైతం జీజీహెచ్ న్యూరాలజీ వైద్యులు గుర్తించి చికిత్స అందించి వ్యాధి నుంచి కోలుకునేలా చేస్తున్నారు. పక్షవాతం, మతిమరుపు, పార్కిన్‌సన్స్ వ్యాధి, మధుమేహ న్యూరోపతి, మెడ సంబంధిత సమస్యలు, వెన్నుసంబంధిత సమస్యలు, మల్టిపుల్ సిరోసిస్, వ్యాధి నిరోధకశక్తి లోపం వల్ల వచ్చే వ్యాధులు, కండరాల వ్యాధులు, డేవిక్స్ డిసీజ్, పిల్లల్లో వచ్చే మూర్ఛవ్యాధి, సెరిబ్రల్ పాల్సీ, పీడియాట్రిక్ న్యూరాలజీ సమస్యలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నారు. జీబీ సిండ్రోమ్ వ్యాధి బాధితులకు సుమారు రూ.3 లక్షలు ఖరీదు చేసే ఇమ్యూనోగ్లోబిన్ ఇంజక్షన్లు ఉచితంగా చేయటంతోపాటుగా రక్తమార్పిడి కూడా చేసి ప్రాణాలు కాపాడుతున్నారు.

మూడు గంటల్లోగా ఆస్పత్రికి తీసుకురావాలి...



పక్షవాతం వచ్చినప్పుడు మాట తడబడం, అయోమయంగా మాట్లాడటం, తల తిరగటం, వాంతులు, నడకలో తూలుడు, మూతి, చేయి ఒకవైపునకు ఒంకరపోవటం, దృష్టి మందగించటం, కాళ్లు చేతులు ఉన్నట్టుండి బలహీన పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో రోగి అపస్మారక స్థితి(కోమా)లోకి వెళ్తాడు. బ్రెయిన్ స్ట్రోక్‌వచ్చిన మూడు గంటల్లోపు స్ట్రోక్ యూనిట్‌కు తీసుకొస్తే త్వరగా రోగి వ్యాధి నుంచి కోలుకోవటంతోపాటుగా అంగవైకల్యం సంభవించకుండా కాపాడవచ్చు.

– డాక్టర్ ఎస్.వెంకటసుందరాచారి, న్యూరాలజీ వైద్య విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్

మిర్చి రైతులకు అన్నివిధాలా అండ

- జిల్లాలో ఈఏడాది 70వేల హెక్టార్లలో మిర్చిసాగు
- కలెక్టరేట్‌లో మిర్చి పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణలో పాల్గొన్న కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎమ్మెల్యే గోపిరెడ్డి



ఎస్సీ, ఎస్టీ రైతులకు మిరప, కూరగాయల విత్తనాలు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు

నరసరావుపేట: జిల్లాలో ఈ ఏడాది మిర్చి పంట 50 వేల హెక్టార్ల నుంచి 70 వేల హెక్టార్లకు పెరగనుందని, అందుకు తగ్గట్టు విత్తన సేకరణ, పంపిణీకి సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందనహాలులో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మిరప పంటలో మెరుగైన వ్యవసాయ పద్ధతులపై శిక్షణ' కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ(ఐఐహెచ్‌ఆర్) అభివృద్ధి చేసిన మిరప విత్తనాలు, ఇతర కూరగాయలతో కూడిన కిట్లను ఎస్సీ, ఎస్టీ రైతులకు పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిర్చి రైతులు పంట వేయక ముందే అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మెరుగైన దిగుబడితో మంచి లాభాలు పొందేలా చూడాలన్న ఉద్దేశ్యంతో బెంగళూరుకు చెందిన ప్రముఖ ఉద్యాన పంటల రీసెర్చి సెంటర్ ఐఐహెచ్‌ఆర్‌కు చెందిన శాస్త్రవేత్తలతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే అందించాలనే ఆశయంతో విత్తన సంస్థలపై తనిఖీలు చేపడుతున్నామన్నారు. రానున్న రోజుల్లో దాడులు ముమ్మరం చేస్తామన్నారు. ప్రతి సోమవారం 'రైతుకు వందనం' కార్యక్రమం ద్వారా నియోజకవర్గానికి ఒక ఆదర్శ రైతును ఎంపిక చేసి, వారి విజయ గాథలు అధికారులు, తోటి రైతులకు తెలియజేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ప్రముఖ రీసెర్చి సెంటర్ ఐఐహెచ్‌ఆర్ సైంటిస్టులతో జిల్లా రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించడం సంతోషకరమన్నారు. గత రెండు సీజన్లుగా దిగుబడి తగ్గుదలకు కారణమవుతున్న తామర పురుగుపై ఐఐహెచ్‌ఆర్ విత్తనాలతో విజయం సాధించి రైతులంతా మంచి లాభాలు ఆర్జించాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు మేలు చేసే నాణ్యమైన విత్తనాలు, ఎరువుల పంపిణీ, గిట్టుబాటు ధరతో పంట కొనుగోలు, రైతు భరోసా రూపంలో ఆర్థిక సహాయం అందించడం, ఉద్యాన రైతులకు డ్రోన్ల పంపిణీ వంటి అనేక బృహత్కర కార్యక్రమాలు చేపడుతోందన్నారు. మిర్చిపంట సాగులో అధిక దిగుబడి సాధించి అవార్డులు పొందిన రైతులు అభిప్రాయాలు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి బీజే. బెన్నీ, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, ఐఐహెచ్‌ఆర్ సైంటిస్టులు శ్రీధర్, నరేశ్, జయంతి మాల, ఎస్సీ, ఎస్టీ రైతులు పాల్గొన్నారు.

ఈ వంగడం తామర తెగులును తట్టుకుంటుంది



ఐఐహెచ్‌ఆర్ అభివృద్ధి చేసిన మిర్చి వంగడాలు తామర తెగులును సమర్థవంతంగా తట్టుకోవడంతో పాటూ మంచి దిగుబడి నిచ్చింది. గతంలో ఐఐహెచ్ఆర్ అందించిన విత్తనాలతో ఎకరం 20 సెంట్లలో మిర్చి పంట వేస్తే 37 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఖర్చులు పోగా రూ.3.5లక్షలు నికర ఆదాయం మిగిలింది.

– రావిపాటి దావీదు, మిర్చి రైతు, బొల్లాపల్లి

పండుగలకు పటిష్ట బందోబస్తు



ఎస్పీ రవిశంకర్ రెడ్డి

నరసరావుపేట: ఈనెల 29న తొలి ఏకాదశి, బక్రీద్ పర్వదినాలను పురస్కరించుకుని కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అన్నీ మతాలు, కులాల వారి ఆచార సంప్రదాయాలను గౌరవించడం మనందరి బాధ్యత అన్నారు. ఈనెల 29న తొలి ఏకాదశి, బక్రీద్ ఒకే రోజు ఉన్నందున ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో తమ ఇష్టదైవాలను ఆరాధించుకోవాలని కోరారు. ఏపీ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి జిల్లా వ్యాప్తంగా గోవధ, గోవుల అక్రమ రవాణా వంటి పనులను నిషేధించడం జరిగిందన్నారు. ఎవరైనా జంతువుల అక్రమ రవాణా, వాటి వధ విషయంలో నిబంధనలను ఉల్లంఘించినట్లు సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు తెలియజేయాలని జిల్లా ఎస్పీ కోరారు.

జిల్లా వైద్యశాలకు రూ.57కోట్లు మంజూరు

- 400పడకలతో సూపర్‌స్పెషాల్టీ వైద్యశాలగా మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు
- మరో 200 పడకలతో విస్తరణ, తల్లిపిల్లల ప్రత్యేక విభాగం ఏర్పాటు
- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



వైద్యశాల పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: నరసరావుపేట లింగంగుంట్లలోని జిల్లా ప్రభుత్వ హాస్పటల్‌ను సూపర్ స్పెషాల్టీగా మార్చుతూ అందుకు అవసరమైన రూ.57కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రస్తుత హాస్పిటల్ నిర్మించగా విస్తరణకు అవసరమైన పక్క నే ఉన్న మిగతా స్థలాన్ని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లు, ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్‌తో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే గోపి రెడ్డి మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా విస్తరణ చేసేందుకు రూ.57కోట్లు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి జిల్లా ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం ఈ హాస్పిటల్‌ను 200 పడకలతో సమర్ధవంతంగా పనిచేస్తుందన్నారు. రోజూ సుమారు 1500 మంది ఓపీ పేషెంట్లు వస్తున్నారన్నారు. ప్రభుత్వ జీఓతో నూతన విస్తరణలో మరో 200 పడకలతో కలిపి మొత్తం 400పడకల వైద్యశాలగా రూపుదిద్దుకోనుందన్నారు. నూతన హాస్పటల్లో తల్లి పిల్లల ప్రత్యేక విభాగం, స్కానింగ్, సిటీ స్కానింగ్, సుమారు 10 నుంచి 15 శవాలు భద్రపర్చే మార్చురీ, వివిధ రకాల ఆధునిక పరికరాలు సమకూరనున్నాయన్నారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బీవీ రంగారావు, ఏపీ ఎంఎస్ఐడీసీ అధికారి శ్రీధర్, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి: జేసీ శ్యాంప్రసాద్



సత్తెనపల్లిలోని ఆర్డీఓ కార్యాలయంలో రీసర్వే పై సమీక్ష నిర్వహిస్తున్న జేసీ శ్యాంప్రసాద్

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ కోరారు. సత్తెనపల్లిలోని ఆర్డీఓ కార్యాలయంలో సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని అమరావతి, పెదకూరపాడు మండలాల పరిధిల్లో రీసర్వే జరుగుతున్న గ్రామాల సిబ్బందితో మంగళవారం సమీక్ష నిర్వహించారు. అమరావతి మండలంలోని వైకుంఠపురంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను పూర్తి చేసి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. పూర్తయిన భూముల వివరాలకు సంబంధించి రికార్డులు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో సత్తెనపల్లి ఆర్డీఓ రాజకుమారి, తహసీల్దార్‌లు క్షమారాణి, నిర్మలాకృష్ణ, విజయశ్రీ, ఆర్డీఓ కార్యాలయ డీఏ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మోసకారి యాత్రగా బస్సుయాత్ర

- ప్రజల నుంచి స్పందన కరువే
- అరవిందబాబు వాస్తవాలను తెలుసుకొని మాట్లాడాలి
- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ధ్వజం

నరసరావుపేట: రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసేందుకే తెలుగుదేశం పార్టీ బస్సు యాత్ర నిర్వహిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఎద్దేవా చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. 2014 ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన 640 హామీలలో ఎన్ని నెరవేర్చారని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే హామీలను తుంగలో తొక్కి ప్రజలకు నరకం చూపించినందువలనే బస్సుయాత్రకు ప్రజల నుంచి స్పందన కరువై అట్టర్ ఫ్లాప్ అయిందని చెప్పారు. భవిష్యత్‌కు గ్యారంటీ అంటూ నిర్వహిస్తున్న బస్సుయాత్ర దేనికి గ్యారంటీ ఇస్తున్నారని ప్రశ్నించారు. అధికారంలో ఉండగా రైతులు, డ్వాక్రా మహిళలను నిలువునా మోసం చేశారన్నారు. ఇప్పుడు కర్నాటక కాంగ్రెస్ పార్టీ, రాష్ట్రంలోని వైఎస్సార్ పథకాలను కాపీకొట్టి అవి అమలు చేస్తామంటూ బస్సుయాత్ర పేరుతో తిరుగుతున్నారన్నారు. వారు చేయని పనులను తామే చేసినట్లుగా చెప్పుకుంటూ సెల్ఫీలు దిగటం దివాళాకోరు రాజకీయాలకు నిదర్శమని ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా చేసిన హామీల్లో 99శాతం నెరవేర్చారని గుర్తు చేశారు. జేఎన్‌టీయూను అప్పటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డితో కాసు కృష్ణారెడ్డి మంజూరు చేయించారని, ఆ విషయాన్ని దివంగత మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు కూడా ఒక బహిరంగ సభలో చెప్పారన్నారు. టీడీపీ రాగానే శంకుస్థాపన చేసిన తర్వాత మూడేళ్లు అధికారంలో ఉన్నా నిర్మాణానికి తట్టెడు సిమెంట్ వేయలేదని పేర్కొన్నారు. మళ్లీ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రహరీ మొదలు పెట్టి ఇప్పుడు భవనాలు పూర్తిచేసే దశకు వచ్చాయని తెలిపారు. మళ్లీ వచ్చేది తమ ప్రభుత్వమేనని, ప్రారంభం కూడా తామే చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో లింగంగుంట్లలోని ఎస్‌ఎస్సీ కాలనీలో ప్రభుత్వ వైద్యశాల నిర్మాణానికి నాబార్డు నిధులు మంజూరు చేశారన్నారు. టీడీపీ హయాంలో వట్టి భవనం నిర్మించి మౌలిక వసతులు వదిలేసి వెళ్లగా తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.4కోట్లతో అన్నీ మౌలికవసతులు ఏర్పాటుచేయటం ద్వారా వైద్యశాల పనిచేస్తుందన్నారు. కోవిడ్ సమయంలో వేలాదిమందికి వైద్య సేవలు అందజేశామన్నారు. ఇప్పుడు మళ్లీ దానిని 200పడకల నుంచి 350పడకల వైద్యశాలగా మారుస్తూ రూ.57కోట్ల నిధులను సీఎం జగన్ మంజూరు చేశారన్నారు. కోటప్పకొండ వద్ద ప్రభుత్వం అనుమతించిన మట్టి క్వారీ దగ్గర సెల్ఫీలు దిగారని, ఆ మట్టి జేఎన్‌టీయూ, జగనన్న కాలనీలకోసం మట్టి అవసరాలకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ అనుమతి ఇచ్చారని పేర్కొన్నారు. అందుకు సంబంధించిన అనుమతిపత్రాలను ప్రదర్శించారు. టీడీపీ నాయకుడు డాక్టర్ అరవిందబాబు చెప్పవి అన్నీ అబద్ధాలేనని, అతనికి ఏమాత్రం నాలెడ్జ్‌లేదని, అరబండపు మాటలు మాట్లాడుతున్నాడని విమర్శించారు. టిడ్కో గృహాలను కట్టించి మౌలిక వసతులు ఏర్పాటు చేయకుండానే అనర్హులైన లబ్ధిదారులను ఎంపికచేసి వారికి మంజూరు పత్రాలు ఇచ్చారని, తమ ప్రభుత్వం రూ.14కోట్లతో తాగునీరు, రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ సదుపాయాలు కల్పించిందన్నారు. వారు 14 ఎకరాల్లో 1504 టిడ్కో ఇళ్లనిర్మాణం చేస్తే తాము జగనన్న కాలనీలు 130 ఎకరాల్లో 8వేల మందికి స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టుకునేందుకు డబ్బులు మంజూరు చేస్తున్నామన్నారు. తాను రూ.2వేలకోట్లు సంపాదించినట్లు అరబండపు బాబు ఆరోపిస్తున్నారని, దానిలో ఒక్క ఆధారం చూపించాలని సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో అసలు సీటుందో లేదో అరవిందబాబు తెలుసుకోవాలని, ఎవరు టీడీపీ నుంచి పోటీ చేసినా మరోసారి గెలిచేది తానేనని ఎమ్మెల్యే గోపిరెడ్డి స్పష్టం చేశారు.



మట్టి క్వారీకి సంబంధించి అనుమతి పత్రాలు చూపిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

ఓటరు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, అధికారులు

జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

నరసరావుపేట: ఓటరు నమోదులో అవకతవకలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ హెచ్చరించారు. జిల్లాలో ఓటర్ల నమోదు ఇతర అంశాల ప్రక్రియకు సంబంధించి నియోజకవర్గ ఎన్నికలు, మండల ఎన్నికల నిర్వహణ అధికారులు, బూత్ లెవల్ ఆఫీసర్లు, రెవెన్యూ డివిజన్ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు రెవెన్యూ డివిజన్లు, నియోజక వర్గాలు, మండలాల్లో చేపట్టిన యువ ఓటర్ల వివరాల నమోదు, ఆధార్ అనుసంధానం, వందేళ్ల వయసు దాటిన ఓటర్ల వివరాలు, ట్రాన్స్ జెండర్స్, చనిపోయిన వారి వివరాలను సేకరించి తొలగింపునకు చర్యలు తీసుకున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఇంటినంబర్లు లేనివారి వివరాలు సేకరించడం, ఒకే ఇంట్లో పది మందికి పైగా ఓటర్లు ఉంటే వెంటనే విచారణ నిర్వహించి నివేదిక అందజేయాలని కోరారు. ఓటరు వివరాల నమోదులో తప్పులు లేకుండా చూడాలని, కళాశాలల ద్వారా యువ ఓటర్ల నమోదు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. గృహాలు లేక రహదారుల వెంట ఉంటున్న వారు, బస్ షెల్టర్స్ వద్ద ఉంటున్న వారి వివరాలను సేకరించి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలన్నారు. వచ్చే శుక్రవారానికల్లా పూర్తి స్థాయి 28 మండలాలు, 3 రెవెన్యూ డివిజన్లు పరిధిలో నివేదికల రూపంలో అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

షెడ్యూల్ తెగల సంక్షేమానికి కృషి

జిల్లాలో షెడ్యూల్ తెగల సామాజిక వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. కలెక్టరేట్ ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో షెడ్యూల్ ట్రైబ్స్ సబ్ ప్లాన్ నిధుల విడుదల, ఖర్చుపై మంగళవారం సాయంత్రం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న బడ్జెట్‌లో ప్రతి ఏటా ట్రైబల్ వెల్ఫేర్ సామాజిక వర్గాల సంక్షేమం కోసం 6.6 శాతం నిధులను తప్పని సరిగా ఖర్చు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం షెడ్యూల్ తెగల సామాజిక వర్గాలకు ట్రైబల్ సబ్ ప్లాన్ నిధుల ద్వారా వచ్చిన నిధులను తప్పని సరిగా అమలు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రధానంగా మైక్రో ఇరిగేషన్, ట్రైబల్ వెల్ఫేర్, సెరి కల్చర్, హార్టీ కల్చర్, జగనన్న బడుగు వికాసం(నవోదయం), వ్యవసాయ శాఖ, జిల్లా పరిశ్రమల శాఖ, ఫిషరీస్ విభాగం, పశుసంవర్ధక శాఖ, జిల్లా క్రాంతి పథం (డీ.ఆర్.డీ.ఏ), పట్టణ పేదల నిర్మూలన సంస్థ(మెప్మా), టిడ్కో తదితర శాఖల అధికారులకు సూచనలు చేశారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఎస్టీ సామాజిక వర్గాలకు కేటాయించిన నిధులు, ఖర్చు చేసిన నిధులతో పాటు మిగిలిన నిధులను తప్పనిసరిగా ఆ సామాజిక వర్గాల అభ్యున్నతికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ శాఖ అధికారిణి దుర్గాబాయి పాల్గొన్నారు.

రౌడీషీటర్ బాజీ హత్య కేసులో నలుగురు అరెస్టు

- కుమారుడి హత్యకు తల్లి ప్రతీకారం..
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ మహేష్

నరసరావుపేట: కుమారుడి హత్యకు ప్రతీకారంగా తల్లి ప్లాన్ చేసి ఎస్‌ఆర్‌కేటీకి చెందిన రౌడీషీటర్ బాజిని హత్య చేయించిందని డీఎస్పీ కేవీ మహేష్ తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ టీకొట్టు బాజీగా పేరొందిన షేక్ బాజి కొంతకాలం క్రితం పఠాన్‌బీ పెద్దకుమారుడైన పఠాన్ సుభానీని హత్య చేశాడు. దీనిపై కక్ష పెంచుకున్న పఠాన్‌బీ తన కుమారుడి హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకుంది. బాజీతో గత కొంతకాలంగా మంచిగా మాట్లాడుతూ నమ్మించి ఫోన్ చేయించి 20వ తేదీ రాత్రి పుట్టినరోజు వేడుకలంటూ హుసేన్ ఇంటివద్దకు పిలిపించింది. పఠాన్ జాన్‌బీ తమ్ముడు హుసేన్, చిన్న కుమారుడు సంధాని, ముళ్లపూడి గోపికృష్ణ, హరీష్‌తో కలసి బాజీని చంపేందుకు నిర్ణయించుకొని పార్టీకి వచ్చిన బాజీ కళ్లల్లో కారం చల్లి కత్తులు, రాడ్‌లతో నరికి చంపారు. శవాన్ని మాయం చేయాలనే ఉద్దేశంతో ఎస్‌ఆర్‌కేటీ ఆరో లైను శివారులోని పొలాల్లోకి మృతదేహాన్ని తీసుకెళ్లి పెట్రోలు పోసి తగులపెట్టి సగం కాలిన శవాన్ని పూడ్చిపెట్టి పారిపోయారు. దీనిపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్‌ఐ బాలనాగిరెడ్డితో ఏర్పాటు చేసిన బృందం నిందితులను అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారని డీఎస్పీ వివరించారు. కేసులో నిందితులు అందరిపై రౌడీషీట్లు తెరవటంతో పాటు వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు.



అరెస్టు చేసిన నిందితులతో డీఎస్పీ మహేష్, సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్‌ఐ బాలనాగిరెడ్డి

యువతరం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో యువతరం బాధ్యతాయుతంగా ఉండాలని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో మంగళవారం గుంటూరు నెహ్రూ యువకేంద్ర, హిందూ ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త అధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువ ఉత్సవ్–2023 ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. పెయింటింగ్, రైటింగ్, మొబైల్ ఫొటోగ్రఫీ, ఉపన్యాస, సాంస్కృతిక అంశాల్లో పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపట్టాయన్నారు. దేశం పట్ల ప్రతి ఒక్కరు భక్తిభావం కలిగి ఉండాలని, యువతరం తమలోని నైపుణ్యాలను అభివృద్ధి పరచుకుని ప్రతిభను ప్రదర్శించేందుకు ఇటువంటి ఉత్సవాలు చక్కటి వేదికలుగా ఉపయోగపడతాయని చెప్పారు. యువ ఉత్సవ్ థీమ్ ఐన పంచ్ ప్రాణ్ అంశాలను వివరించారు. యువత చేతుల్లోనే దేశ భవిత దాగి ఉందని, వారి శక్తిని మనం సరైన దారిలో ఉపయోగించడం ద్వారా భారతదేశాన్ని అగ్రగామిగా నిలపవచ్చన్నారు. గుంటూరు ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ యువతలోని ప్రతిభను వెలికితీసి వారిలో ఉత్తేజం నింపటంతో పాటు మన దేశ విలువలను, సాంస్కృతిక వారసత్వాలను కాపాడేందుకు ఇటువంటి యువ ఉత్సవాలు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో హిందూ కళాశాల ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ అధ్యక్షురాలు ఈదా నిర్మల, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి కిరణ్మయి దేవిరెడ్డి పాల్గొన్నారు.

2న జిల్లాస్థాయి కర్రసాము పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): సిలంబమ్ (కర్రసాము) అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కర్రసాము పోటీలు నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షులు వంగ నవీన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను వచ్చే నెల 2వ తేదీ గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసామని చెప్పారు. ఈ కార్యక్రమానికి మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత పాల్గొంటారన్నారు.

హత్య కేసులో నిందితులు అరెస్ట్


నిందితుల్లో సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్

దాచేపల్లి: యువకుడి హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ ఎ.సురేంద్ర బాబు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురంలో హతుడు మారబోయిన కోటేశ్వరరావు నివసిస్తున్నాడు. రెండు నెలల క్రితం వివాహమైంది. కోటేశ్వరరావు నివసిస్తున్న వీధిలోనే సీఆర్పీఎఫ్‌లో కానిస్టేబుల్ బొమ్మనబోయిన శ్రీనివాసరావు నివసిస్తున్నాడు. భార్యతో కోటేశ్వరరావుకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానం ఉంది. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావుకు భార్యతో పలుమార్లు వివాదాలు జరగటంతో గత 5 నెలల క్రితం భార్యను పుట్టింటికి పంపించాడు. భార్య పుట్టింటికి వెళ్లినప్పటి నుంచి కోటేశ్వరరావును హత్య చేసేందుకు శ్రీనివాసరావు పథకం వేశాడు. ఈ క్రమంలో తన అన్న బొమ్మనబోయిన నరసింహారావు, అక్క కొరటా లక్ష్మీకుమారితో కలిసి ఈ నెల 19వ తేదీన కోటేశ్వరరావును అతని ఇంటి సమీపంలోనే ఇనుపరాడ్డుతో కొట్టటంతో తీవ్రంగా గాయపడ్డాడు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడు. హత్య అనంతరం నిందితులు పరారయ్యారు. హత్య కేసుగా నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి హత్య కేసులో నిందితులైన బొమ్మనబోయిన శ్రీనివాసరావు, బొమ్మనబోయిన నరసింహారావు, కొరటా లక్ష్మీకుమారిలను నడికుడిలో సంచరిస్తుండటంతో సమాచారం అందటంతో అదుపులోకి తీసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ సురేంద్రబాబు చెప్పారు. సమావేశంలో ఎస్‌ఐ దాసరి శివనాగరాజు ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేంద్రబాబు, ఎస్‌ఐ శివనాగరాజు

క్రికెటర్ అంబటి సేవలు ఎనలేనివి



ఫిరంగిపురం: దేశానికి ఇండియన్ క్రికెటర్ అంబటి రాయుడు ఎనలేని సేవలు అందజేసారని మార్నింగ్ స్టార్ కళాశాల కరస్పాండెంట్ , ప్రభుత్వ క్రిస్టియన్ వ్యవహారాల గౌరవ సలహాదారుడు మద్దు బాలస్వామి అన్నారు. మండల కేంద్రంలోని మార్నింగ్‌స్టార్ కళాశాలను ఇండియన్ క్రికెటర్ అంబటి రాయుడు సందర్శించారు. విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు అంబటి సమాధానాలు ఇచ్చారు. అనంతరం ఫాదర్ బాలస్వామి క్రికెటర్ అంబటి రాయుడిని సన్మానించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో సమాజానికి సేవలందించేలా కృషిచేయాలని చెప్పారు. అనంతరం మండలకేంద్రంలోని తూర్పు బజారులోని మేనమామ కొలగాని రవికుమార్ నివాసానికి నేషనల్ ఇండియన్ క్రికెటర్ అంబటి రాయుడు వచ్చారు. అమీనాబాద్ గ్రామంలోని మూలాంకురేశ్వరి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఫిరంగిపురంలోని బాలఏసు దేవాలయంలో కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవాలయ విచారణ గురువులు బాలస్వామి, సహాయవిచారణ గురువులు అనిల్‌కుమార్ అంబటిని ఆశీర్వదించారు. అనంతరం సెయింట్ పాల్స్ హైస్కూల్‌లోని విద్యార్థులతో కొద్దిసేపు రాయుడు ముచ్చటించారు.

ప్రేమ వివాహం వద్దన్నారని..

పురుగుమందు తాగి యువతి ఆత్మహత్య



మృతురాలు మోనాలిసా

నాదెండ్ల: ప్రేమించి పెళ్లి చేసుకున్న మొదటి వివాహం సంప్రదాయబద్ధంగా లేదని తల్లిదండ్రులు భర్త నుంచి వేరు చేశారు. ఆపై కొద్ది నెలలకే మరొకరిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని తల్లిదండ్రులకు ప్రతిపాదన చెప్పటంతో తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేయటంతో యువతి మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గణపవరంలో చోటుచేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. ఒడిశా రాష్ట్రం బద్ర్ జిల్లా కాన్పూరుకు చెందిన మల్లిక్ రంజన్‌కుమార్, సనాతన దంపతులకు ముగ్గురు సంతానం. సుమారు ఐదేళ్ల క్రితం వలస వచ్చి చిలకలూరిపేట రూరల్ మండలం బొప్పూడిలో ఉంటూ టెక్స్‌టైల్స్ మిల్లులో పనిచేస్తున్నారు. అయితే 2019లో కరోనా కారణంగా కంపెనీలు లాక్‌డౌన్ ప్రకటించటంతో తిరిగి ఆ కుటుంబం ఒడిశాకు వెళ్ళింది. ఏడాది క్రితం పనుల కోసం తిరిగి వచ్చారు. లాక్‌డౌన్ సమయంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన దేవేందర్‌ను ప్రేమించి వివాహం చేసుకుంది. అయితే తల్లిదండ్రులు వివాహాన్ని ఒప్పుకోకపోవటంతో మోనాలిసా తల్లిదండ్రుల వద్దనే ఉంది. కొద్ది నెలల క్రితం మోనాలిసాను తల్లిదండ్రులు పనుల నిమిత్తం చెన్నైకు పంపారు. అక్కడ పని చేస్తున్న సమయంలో కాకినాడకు చెందిన ఓ యువకుడు పరిచయం కావటంతో ప్రేమలో పడి వివాహం చేసుకుంది. తల్లిదండ్రుల వలన తనకు ప్రాణహాని ఉందని కాకినాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాకినాడ పోలీసులు తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి అనంతరం మోనాలిసాను తల్లిదండ్రులతో పాటూ నాదెండ్ల మండలం గణపవరంలో నివాసం ఉండే మేనమామ ఇంటికి తీసుకొచ్చారు. ఈ నెల 23న క్రితం మేనమామ ఇంటి వద్దే ఘర్షణ పడి తాను ప్రేమించిన యువకుడితో వివాహం చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటానని పురుగుమందు తాగింది. కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, వైద్యం పొందుతూ ఆదివారం మృతి చెందింది. దీనిపై నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు రావటంతో గుంటూరు జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేశారు.